సాక్షి
జోగులాంబ గద్వాల

ఆదివారం : 5 : జనవరి : 2025



పరిశోధనలు మెరిసే

వినూత్న ఆలోచనలతో సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతున్నారు విద్యార్థులు.

వివరాలు 8లో ▸



శరవేగంగా వంతెన

తెలంగాణ- కర్ణాటక సరిహద్దులో కృష్ణానదిపై వంతెన నిర్మాణం వేగంగా సాగుతోంది.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.7 /12.4

ఉదయం, రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

కార్మికులపై అణచివేత విధానాలు తగదు

గద్వాల న్యూటౌన్: సివిల్ సప్లై హమాలీ కార్మికులపై అణచివేత విధానాలకు స్వస్తి పలికి వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ యంత్రాంగం కృషి చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని స్టాక్ పాయింట్ వద్ద హమాలీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో భాగంగా కార్మిక వర్గానికి అనేక హామీలను ఇచ్చి వాటిని అమలు చేయకుండా అబాసు పాలైందని విమర్శించారు. సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమ్మె విషయంలో నిరంకుశంగా వ్యవహరించవద్దని హితవు పలికారు. కార్మిక సంఘాలను చర్చలకు ఆహ్వానించి ఇచ్చిన హామీలకు సంబంధించి జీఓను వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నర్సింహ్మా, సివిల్ సప్లై యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి శివకృష్ణ, నరేష్, గోవిందు, చిన్న, నందరకిషోర్, ఆంజనేయులు, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం నాటికి సాగునీరు అందించాలి



ఇటిక్యాల: వానాకాలం నాటికి సాగునీరు అందించాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శనివారం మండలంలోని చాగాపురం, షాబాద్, శనగపల్లి గ్రామాలను ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ 99, 100వ విస్తరణ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. మల్లెందొడ్డి 108 ప్యాకేజీ డిస్ట్రిబ్యూటర్ కాల్వలో పేరుకుపోయిన సిల్ట్ పనులను వెంటనే పూర్తిచేయాలన్నారు. అదేవిధంగా తూములకు వెంటనే షెట్టర్స్ ఏర్పాటు చేసి చివరి ఆయకట్టు గ్రామాల రైతులకు న్యాయం జరిగే విధంగా చూడాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు బాలకృష్ణరెడ్డి, హనుమంతు రెడ్డి, రంగారెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.6,729

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు శనివారం 1050 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ. 6729, కనిష్టం రూ.3386, సరాసరి రూ.4932 ధరలు పలికాయి. 2 క్వింటాళ్ల ఆముదాలు రాగా గరిష్టం, కనిష్టం, సరాసరి రూ. 5457 ధర లభించింది. 209 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం రూ. 2387, కనిష్టం రూ. 1856, సరాసరి రూ. 2357 ధరలు పలికాయి. అలాగే, 150 క్వింటాళ్ల కంది రాగా గరిష్టం రూ.7639, కనిష్టం రూ. 4006, సరాసరి రూ. 7639 ధరలు వచ్చాయి.

అక్రమాలు వెలుగులోకి..

రైస్‌మిల్లుల్లపై మూడు రోజుల పాటు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు



దువాస్‌పల్లి వద్ద పట్టుబడిన పీడీఎస్ బియ్యం లోడు లారీ (ఫైల్)

- గద్వాల, కేటీదొడ్డి రైస్‌మిల్లుల్లో వెలుగు చూసిన అక్రమాలు
- ధాన్యం నిల్వలో అవకతవకలు
- తప్పించుకునేందుకు మిల్లర్ల పైరవీలు

గద్వాల: జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల పాటు రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన అక్మసిక దాడులు, తనిఖీలతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. ముఖ్యంగా ప్రభుత్వం ఇస్తున్న బోనస్‌ను బొక్కేసెందుకు కొందరు అక్రమార్కులు ఇప్పటికే పెద్ద ఎత్తున స్కెచ్‌వేసి అక్రమమార్గంలో పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల నుంచి ధాన్యం తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే బలమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈనేపథ్యంలో రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించడం జిల్లా వ్యాప్తంగా కలకలం రేపింది.

నడిగడ్డ అడ్డాగా దందా..

ఆది నుంచి పీడీఎస్ బియ్యం అక్రమ దందాకు నడిగడ్డ అడ్డాగా పేరుగాంచింది. ఆ తరువాత ప్రభుత్వం వద్ద తీసుకున్న ధాన్యానికి సంబంధించి అందించాల్సిన సీఎమ్మార్‌ను ఇవ్వకుండా నేరుగా ధాన్యాన్నే అమ్ముకు తిన్న ఘనులు కొందరు మిల్లర్లు. ఈక్రమంలోనే రూ.20కోట్ల ధాన్యం కుంభకోణం చోటుచేసుకోగా తాజాగా మరోసారి పెద్ద ఎత్తున పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం కొనుగోలు చేసి బోనస్ బొక్కేసేలా కొందరు మిల్లర్లు చక్రం తిప్పుతున్నారనే బలమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

62 కేసులు.. 972 క్వింటాళ్లు స్వాధీనం

జిల్లా వ్యాప్తంగా రేషన్ బియ్యం దందా చేస్తూ పోలీసులకు పట్టుబడిన కేసులు కోకొల్లలు. గతేడాది జిల్లా వ్యాప్తంగా పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకొన్నారు. మొత్తం 62 కేసులు నమోదు చేయగా.. ఇందులో 972.74క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు. దీనిని బట్టి జిల్లాలో పీడీఎస్ బియ్యం దందా ఏ స్థాయిలో సాగుతుందో స్పష్టమవుతుంది. దీని విలువ బహిరంగా మార్కెట్‌లో సుమారు రూ.10లక్షలకు పైనే ఉంటుంది. ఈ లెక్క కేవలం అధికారులు పట్టుకున్నవి మాత్రమే.. వారి కళ్లుకప్పి ఇంతకు పదింతల స్థాయిలో పీడీఎస్ బియ్యం దందా కొనసాగుతున్నట్లు బలమైన ఆరోపణలున్నాయి. ఇదిలా ఉండగా, జిల్లాలో పలు రైస్‌మిల్లుల్లో నిబంధనలకు విరుద్ధంగా పీడీఎస్ బియ్యాన్ని మరఆడించి సీఎమ్మార్‌గా అందిస్తున్నారనే ఆరోపణలపై గతేడాది సైతం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. కేటీదొడ్డి మండలం, గద్వాల, అయిజ, శాంతినగర్ మండలాల పరిధిలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు.

పీడీఎస్ బియ్యం బొక్కడంలో దిట్ట

ఎర్రవల్లి మండలం జింకలపల్లి వద్ద ఉన్న రైస్‌మిల్లు యజమాని ప్రకాష్ గతేడాది అక్టోబర్‌లో 53క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను నేరుగా తన మిల్లులో అక్రమంగా డంప్ చేసుకున్నాడు. విషయం తెలిసిన పోలీసు, సివిల్ సప్లై శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. అక్రమంగా దాచిన 53క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అక్రమాలకు పాల్పడిన సదరు మిల్లు యజమాని ప్రకాష్‌పై కేసు నమోదుచేశారు. గతంలో ప్రభుత్వం వద్ద తీసుకున్న ధాన్యానికి సంబంధించి అందించాల్సిన సీఎమ్మార్ ఇవ్వకపోవడంతో ఈ మిల్లును డిఫాల్ట్ కింద చేర్చారు.

తాజాగా 153 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



గతేడాది నందిన్నెలోని రైస్‌మిల్లులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు(ఫైల్)

జిల్లా వ్యాప్తంగా 2, 3, 4వ తేదీల్లో రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన దాడుల్లో దువాస్‌పల్లి వద్ద ఉన్న ఓ రైస్ మిల్లు వద్ద ఏకంగా 153 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పోలీసులు కేసు నమోదుచేశారు. అదేవిధంగా గద్వాలలోని బీరెల్లికి వెళ్లే దారిలో ఉన్న మరో రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన ధాన్యాన్ని గుర్తించారు. అయితే, సదరు మిల్లు యజమాని ఈ వ్యవహారం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిసింది. అదేవిధంగా కేటీదొడ్డి మండలంలోని నందిన్నెలోని ఓ రైస్‌మిల్లులో కూడా ధాన్యం లెక్కలు సరిగ్గా లేకపోవడం గుర్తించిన అధికారులు సదరు మిల్లు యజమానికి నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని ప్రతిఒక్కరికి రోడ్డు భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించేలా రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. శనివారం రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం ఆయన ఎస్పీ శ్రీనివాస్‌రావుతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి మాసాంతం వరకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రోడ్లపై ప్రమాదాలు జరిగినప్పుడు బాధితుల ప్రాణాలను రక్షించేందుకు తక్షణం చర్యలు చేపట్టే విధంగా ప్రణాళిక ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో ఉన్న రోడ్‌సేఫ్టి కౌన్సిల్ సమావేశం నిర్వహించి ప్రమాదాలు నిర్వహించే ప్రాంతాలను గుర్తించి అక్కడ అవసరమైన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పాఠశాల పరిసరాల్లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అవసరమైన జాగ్రత్తలు పాటించాలన్నారు. రోడ్లు, భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖ, రహదారుల్లో సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వీటిని రోడ్డురవాణ శాఖ అధికారులు పర్యావేక్షించాలన్నారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఈ ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రాల నుంచి బస్సులు నడపండి

అలంపూర్: రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ క్షేత్రానికి జిల్లా కేంద్రాల నుంచి ఆర్టీసీ బస్సులు నడపాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ గ్రేటర్ ఆర్టీసీ ఈడీ వినోద్‌కుమార్‌ను కోరారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన చాంబర్‌లో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడంతోపాటు అమ్మవారి ప్రసాదం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. అలంపూర్ మున్సిపాలిటీలోని జోగుళాంబ శక్తిపీఠాన్ని దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారని, హైదరాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రాల నుంచి భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు నడపాలని కోరారు. అలంపూర్ చౌరస్తాలో ఆర్టీసీ బస్ డిపో నిర్మించాలని, పాత ఆర్టీసీ బస్టాండ్ ఆర్టీసీ సంస్థ స్వాధీనం చేసుకోవాలని లేదా మున్సిపాలిటీకి అప్పగిస్తే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

ఇంటింటా కంటి వెలుగు

సండే స్పెషల్



సర్వేంద్రియాణాం నయనం ప్రధానం.. మనిషి పుట్టుక నుంచి ప్రపంచాన్ని చూసి ఆస్వాదించాలంటే కళ్లు ఎంతో ముఖ్యం. మనిషి తన శరీరంలో ఏ అవయవం పని చేయకపోయినా తన పని తాను చేసుకోగలుగుతాడు.. కానీ, కళ్లు లేకపోతే జీవన ప్రయాణం అంధకారమవుతోంది. నేటి సమాజంలో పోషకాహార లోపంతో కొంత మందికి పుట్టుకతోనే అంధత్వం సంభవిస్తుంది. అలాంటి వారికి చూపునిచ్చే లక్ష్యంతో 26 ఏళ్ల క్రితం ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యాలయం నాగర్‌కర్నూల్ జిల్లా తూడుకుర్తిలో నెలకొల్పారు. కేవలం ఈ ప్రాంత ప్రజలకే కాకుండా ఉమ్మడి పాలమూరులోని ఇతర జిల్లాల ప్రజలు సైతం ఇక్కడికి వచ్చి కంటిచూపు పొందుతున్నారు. లాభాపేక్ష లేకుండా కొన్ని లక్షల మందికి వైద్యసేవలు.. వేలాది మందికి కంటి శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. - నాగర్‌కర్నూల్

చూపులేని వారికి చుక్కానిలా నిలుస్తున్న తూడుకుర్తి కంటి ఆస్పత్రి


- అంధులు లేని సమాజ నిర్మాణానికి కృషి
- 26 ఏళ్లలో 47,928 మందికి కంటి శస్త్రచికిత్స
- కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తూ రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు

ఓపీ సేవలు పొందినవారు 4,14,726	శస్త్రచికిత్స చేసుకున్న వారు 47,928
సబ్‌సెంటర్ల ద్వారా సేవలు పొందిన వారు 4,56,045	
పరిమిత ఫీజులతో శస్త్రచికిత్స చేయించుకున్న వారు 17,754	
ఉచిత శస్త్రచికిత్సలు చేయించుకున్నవారు 30,174	

ఉచిత సేవ..

నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రానికి 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న తూడుకుర్తిలో కూచుకుళ్ల రామచంద్రారెడ్డి ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో నిత్యం 100 మందికి పైగా కంటి సమస్యలు ఉన్నవారు పరీక్షలు చేయించుకుంటారు. ఇందులో శస్త్రచికిత్స అవసరం (క్యాటరాక్ట్ పొర, గ్లకోమా, టెరిజమ్, రెటీనాకు సంబంధించి ఇంజెక్షన్‌వంటి చికిత్స) ఉన్నవారికి ఇక్కడే ఆపరేషన్లు చేస్తారు. చిన్న పిల్లలకు, మెల్ల కన్ను వంటి వారికి సైతం ఇక్కడే చికిత్స అందిస్తున్నారు. ఇక్కడి వైద్యుల ద్వారా మాత్రమే కాకుండా నెలకోసారి హైదరాబాద్ నుంచి నిపుణులను తీసుకువచ్చి కూడా వైద్యసేవలు అందిస్తున్నారు. వీటితో పాటు నెలకు రెండుసార్లు పశ్యంత్ పేరుతో ఏర్పాటు చేసిన డయాగ్నోస్టిక్ మొబైల్ వ్యాన్‌ను కూడా ఇక్కడికి రప్పించి అందులో ఉన్న అత్యాధునిక పరికరాలతో స్కానింగ్ వంటి సేవలు అందిస్తున్నారు.

⇨ 1998 సంవత్సరంలో ఆస్పత్రి ఏర్పాటు సమయంలో ప్రస్తుత ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి 10 ఎకరాల భూమిని ఆస్పత్రికి ఉచితంగా ఇచ్చారు. ఇందుకు తన తండ్రి కూచుకుళ్ల రామచంద్రారెడ్డి పేరుతో నేత్ర వైద్యాలయాన్ని 1998, అక్టోబర్ 21న ప్రారంభించారు.



తూడుకుర్తిలోని కూచుకుళ్ల రామచంద్రారెడ్డి కంటి ఆస్పత్రి

సబ్‌సెంటర్ల ద్వారా కూడా..

తూడుకుర్తిలోనే కాకుండా ఆస్పత్రి పరిధిలోని ఉపకేంద్రాలు ఏర్పాటు చేసి వైద్యం చేస్తున్నారు. నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, వనపర్తి, కొత్తకోట, తెలకపల్లి, కల్వకుర్తి, లింగాల, పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్ ప్రాంతాల్లో ఉపకేంద్రాలను ఏర్పాటు చేసి ఆయా కేంద్రల వద్ద ప్రజలకు సేవలు అందిస్తున్నారు. అక్కడే కంటి పరీక్షలు చేసి.. చికిత్స అవసరమైన వారిని అంబులెన్స్‌లో తీసుకెళ్లి వైద్యసేవలు అందిస్తారు. సబ్ సెంటర్ల ద్వారా 4,56,045 మందికి సేవలు అందించారు. అలాగే గ్రామాల్లో సైతం వైద్య సేవలు విస్తరిస్తున్నారు. ఫీల్డ్ స్టాఫ్ గ్రామాల్లో ఇంటింటికి తిరిగి కంటి సమస్యలు ఉన్నవారిని గుర్తించి వైద్య సహాయం అందిస్తున్నారు. ఆస్పత్రిలో శస్త్రచికిత్స అనంతరం పేషెంట్లను ఇంటి వద్దే దింపి వారికి అద్దాలు, మందులు అందజేస్తారు.

అంధుల్లో ఆత్మస్థైర్యం నింపేలా..

పుట్టుకతో అంధులైన వారికి కళ్లు తెప్పించలేకపోయినా వారు జీవించగలిగేలా అవగాహన కల్పించి అందరి మన్ననలు పొందుతున్నారు. ఒకవేళ 15 ఏళ్లలోపు చిన్నారులు పుట్టుకతోనే అంధులైతే వారికి అంధుల పాఠశాలల్లో అడ్మిషన్లు ఇప్పిస్తున్నారు. మరి కొందరికి బ్యాంకర్లతో మాట్లాడి రుణాలు ఇప్పించి చిన్నపాటి వ్యాపారాలు పెట్టించి వారి కాళ్ల పై వారు నిలబడేలా శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే 70 మంది చిన్నారులకు అంధుల పాఠశాలల్లో అడ్మిషన్లు ఇప్పించగా.. మరో 70 మంది ఆర్థికంగా నిలదొక్కుకునేలా రుణాలు ఇప్పించారు.

సిబ్బంది సేవలు భేష్..

ఈ కంటి ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది అందిస్తున్న సేవలు అద్భుతంగా ఉండడం వల్లే 26 ఏళ్లుగా కొనసాగుతున్నాయి. పేషెంట్లు ఆస్పత్రికి వచ్చిన మొదలు చికిత్స అందించి ఇంటికి పంపే వరకు వారితో స్నేహపూర్వకంగా మెలుగుతూ ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటున్నారు. కాగా ప్రస్తుతం ఆస్పత్రిలో ముగ్గురు ఆప్తాల్మజిస్టులు, ఇద్దరు అడ్మినిస్ట్రేటర్లు, ఐదు మంది విజన్ టెక్నీషియన్లు, ముగ్గురు పేషెంట్ కౌన్సిలర్లు, ఐదు మంది నర్సింగ్ అసిస్టెంట్లు, ఒకరు ఓటీ టెక్నీషియన్, ఒకరు కమ్యూనిటీ బేస్డ్ రీహాబిలిటేషన్ వర్కర్, 15 మంది సపోర్టెడ్ స్టాఫ్, మరో 15 మంది ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు.

ఏడాది వారీగా నమోదైన ఓపీ కేసులు, ఆపరేషన్లు

ఏడాది	ఓపీలు	ఆపరేషన్లు
2020	16,974	1,409
2021	23,583	2,666
2022	27,012	3,039
2023	29,402	2,965
2024	22,169	2,104

అత్యాధునిక పరికరాలతో..



ఇక్కడికి కంటి సమస్యలతో వచ్చే పేదలకు అత్యాధునిక పరికరాలతో వైద్య సేవలు అందిస్తున్నాం. దాదాపుగా 80 శాతం వైద్యసేవలు తూడుకుర్తిలోనే చేస్తున్నాం. వైద్యంతో పాటు అంధులకు ఆత్మస్థైర్యం కల్పించేలా ఉపాధి చూపడంతో పాటు, 15 ఏళ్లలోపు పిల్లలకు అంధుల పాఠశాలల్లో అడ్మిషన్లు కూడా ఇప్పిస్తున్నాం. - ప్రేమ్‌కుమార్, అడ్మినిస్ట్రేటర్, తూడుకుర్తి కంటి ఆస్పత్రి

సేవలు వినియోగించుకోండి



గ్రామీణ ప్రాంతంలో నెలకొల్పిన కంటి ఆస్పత్రి ద్వారా పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నాం. అత్యాధునిక పరకరాలతో పరీక్షలు చేయడమే కాకుండా శస్త్రచికిత్సలు సైతం చేస్తున్నాం. ఈ ప్రాంతం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా వైద్య సేవలు పొందేందుకు వస్తున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలి. - సింధూజ, కంటి వైద్యురాలు

1,300 మందికి పరీక్షలు



తూడుకుర్తి ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. పెబ్బేరుతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు 1,300 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేయించాం. తెల్లరేషన్ కార్డు ఉన్నవారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి మందులు ఇచ్చాం. డాక్టర్లు, సిబ్బంది మంచిగా సేవ చేస్తున్నారు. - అక్కమ్మ, సామాజిక కార్యకర్త, పెబ్బేరు

ఆవిష్కరణలతో సమస్యలకు పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



శాస్త్రీయ నృత్యాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గద్వాలటౌన్: నేటి తరం విద్యార్థులు విజ్ఞాన ఆవిష్కరణలపై ఆసక్తిని చాటుతూ పలు సమస్యల పరిష్కారాన్ని చూపించేలా వాటిని రూపొందించాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక అనంత ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసి సమాజానికి ఉపయోగపడే విధంగా ప్రదర్శనలను ఆవిష్కరించాలని సూచించారు. విద్యార్థులలో శాస్త్ర విజ్ఞానానికి కొదవ లేదని, దీనిని ప్రజాపరం చేసే ఆలోచన ప్రభుత్వాలకు ఉన్నప్పుడే పలు సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయన్నారు. గద్వాలలో సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాలలో భారతదేశం గర్వించే స్థాయికి విద్యార్థులు ఎదగాలని, ఆ దృష్టితో విద్యార్థులు పరిశోధనలు సాగించాలన్నారు. డీఈఓ అబ్దుల్ ఘనీ మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రాన్ని మానవాళి మనుగడకు ఉపయోగించాలని కోరారు. శాస్త్రీయ విద్యా ప్రమాణాలు ఉన్న విద్యార్థులను మరో కోణంలో నిలబెడతాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, మార్కెట్‌యార్డు చైర్మన్ కుర్వ హనుమంతు, వార్డు కౌన్సిలర్లు కృష్ణ, నరహరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనలను తిలకించిన నాయకులు

రెండు రోజుల పాటు జరిగే జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలను గద్వాల ఎమ్మెల్యే, అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు వేర్వేరుగా తిలకించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 248 ప్రదర్శనలను విద్యార్థులు ఆవిష్కరించారు. ఎమ్మెల్యేలు ఆవిష్కరణలను తిలకిస్తూ విద్యార్థులను అడిగి ప్రదర్శన ఉపయోగాలు, పనిచేయు విధానాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రయోగశాలలుగా మారితే సాంకేతిక రంగంలో విజయం సాధ్యమవుతుందన్నారు. ప్రారంభోత్సవ వేడుకల్లో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మానవహారంతో నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

గద్వాలటౌన్: జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణం క్రమబద్ధీకరించాలని, తమ ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు రోజుకో రీతిలో వినూత్నంగా సాగుతున్నాయి. శనివారం 26వ రోజు దీక్ష చేపట్టిన కేజీబీవీ సీఆర్‌టీలు, సీఆర్పీలు, డీఎల్ఎంటీ, సీసీఓ, పీటీఐ, యూఆర్ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించి, కృష్ణవేణి చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్ ఉపాధ్యాయ, ప్రజాసంఘాల నాయకులు వేర్వేరుగా సంఘీభావం ప్రకటించి పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని, వారిని తక్షణమే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యోగికి జీవిత, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. రెగ్యులర్ చేసేవరకు కనీస వేతన స్కేల్‌ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు, కేజీబీవీ ఎస్ఓలు, సీఆర్‌టీలు, పీఈటీలు, ఏఎన్ఎంలు, వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

108 సేవలను వినియోగించుకోవాలి



గట్టులో 108 అంబులెన్స్‌ను పరిశీలిస్తున్న జిల్లా అధికారి రత్నమయ్య

గట్టు: ఆపద సమయంలో సహాయం కోసం 108కు కాల్ చేస్తే వీలైనంత త్వరగా అంబులెన్స్ అందుబాటులో ఉంటుందని 108 జిల్లా అధికారి రత్నమయ్య తెలిపారు. శనివారం గట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంబులెన్స్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను, ఆక్సిజన్, మెడికల్ కిట్టు, ఇతర పరికరాలను పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సేవల కోసం 108కు కాల్ చేసి, సహాయం పొందవచ్చునని, 24 గంటలు సేవలు అందుబాటులో ఉంటాయని సూచించారు.

క్లుప్తంగా

యువ రైతు ప్రాణం తీసిన కరెంటు కంచె


వడ్ల కురుమప్ప (ఫైల్)

కొత్తపల్లి: పంటకు రక్షణగా ఏర్పాటు చేసుకున్న విద్యుత్ కంచె ఓ యువ రైతు పాలిట యమపాశంగా మారిన ఘటన కొత్తపల్లి మండలం దుప్పటిగట్టు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. దుప్పటిగట్టు గ్రామానికి చెందిన వడ్ల కురుమప్ప (32) వరిపంటకు నీరు పెట్టేందుకుగాను తెల్లవారుజామున వ్యవసాయ పొలానికి వెళ్లాడు. వరి పొలానికి నీరు పారిస్తున్న క్రమంలో పక్క పొలంలో ఏర్పాటుచేసిన విద్యుత్ కంచెకు ప్రమాదవశాత్తు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మద్దూరు ఎస్ఐ రాంలాల్ ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా మార్చురీకి తరలించారు. మృతుడి భార్య నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, మృతుడు కుర్మప్ప మద్దూరు మండలంలోని ఖాజీపూర్ గ్రామం నుంచి ఆరేళ్ల క్రితం దుప్పటిగట్టుకు ఇల్లరికం వచ్చాడు. అతడికి కుమారుడు, కూతురు ఉన్నారు. యువ రైతు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి


సల్వాది చెన్నమ్మ (ఫైల్)

తెలకపల్లి: వాహనం ఢీకొని ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన మండలంలో శనివారం చోటు చేసుకున్నట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన సల్వాది చెన్నమ్మ (70) శనివారం సాయంత్రం కూలీ పనికి వెళ్లి తిరిగి ఇంటి వస్తుండగా ఆంధ్రప్రదేశ్ కృష్ణా జిల్లా పెంచికలమర్రు మండలం కైకలూరుకు చెందిన ఘంటశాల మనోజ్‌కుమార్ గౌరారం గ్రామ శివారు మ్యాల్ల బావి ఒడ్డున బొలెరో వాహనంలో మట్టి నింపుకొని వెనకకు తీస్తూ ఆమెను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆమె మీదుగా వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. చెన్నమ్మకు భర్త అంకాలు, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

వీడియోల కలకలం

పాలిటెక్నిక్ కళాశాల బాత్‌రూంలో సెల్‌ఫోన్ పెట్టి వీడియోల చిత్రీకరణ


ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

- గంటన్నర పాటు వీడియో రికార్డింగ్?
- కాలేజీ ఎదుట పలు విద్యార్థి సంఘాల ఆందోళన
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- కళాశాలను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల బాలికల బాత్‌రూంలో వీడియో చిత్రీకరించేందుకు ఓ విద్యార్థి యత్నించడం కలకలం రేపింది. శనివారం ఉదయం 10.30 గంటలకు కళాశాలలో పలువురు విద్యార్థులు వాష్‌రూం కోసం వెళ్లగా అక్కడ వెంటిలేటర్ విండో వద్ద ఓ సెల్‌ఫోన్ ఉండటాన్ని గమనించారు. దీంతో ఈ విషయాన్ని అధ్యాపకుల ద్వారా ప్రిన్సిపాల్‌కు చేరవేయడంతో వెంటనే సెల్‌ఫోన్‌ను తెప్పించారు. సెల్‌ఫోన్ లాక్ తీసేందుకు ప్రయత్నించగా రాలేదు. ఇంతలోనే అదే కళాశాల పాత విద్యార్థి సిద్ధార్థ్ వచ్చి సెల్‌ఫోన్ తనదేనని చెప్పగా.. దానికి లాక్ తెరిపించారు. అందులో రికార్డు అయిన వీడియోలు ఉన్నట్లు సమాచారం. దీంతో ప్రిన్సిపాల్ వెంటనే షీటీంకి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని సదరు విద్యార్థిని సైతం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అప్పటికే విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు అక్కడికి చేరుకుని విద్యార్థులతో కలిసి ఆందోళన చేపట్టారు. సెల్‌ఫోన్‌లో సుమారు గంటన్నర పాటు వీడియో ఉండి పలువురు విద్యార్థినులు రికార్డు అయినట్లు విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు.

పరీక్ష రాయడానికి వచ్చి..

వారం రోజులుగా పాలిటెక్నిక్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతున్నాయి. బ్యాక్‌లాగ్ పరీక్షకు రాసేందుకు వచ్చిన కరీంనగర్ జిల్లా మంథనికి చెందిన 2019–21 బ్యాచ్‌కు సంబంధించి ఇదే కళాశాల పాత విద్యార్థి సిద్ధార్థ్ బాత్‌రూంలో సెల్‌ఫోన్ పెట్టినట్లు తేలింది. ఉదయం ఎవరూ రాకముందే బాత్‌రూం వెనక వైపు నుంచి గోడ దూకి బాత్‌రూంలో ఫోన్ పెట్టినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా.. బాలికల బాత్‌రూం వైపు వెళ్తుంటే ఎవరూ గమనించ లేదా.. సీసీ కెమెరాలు సైతం ఉన్నప్పటికీ అధికారులు ఎందుకు పట్టించుకోలేదని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఫోన్ బాత్‌రూంలో పెట్టేందుకు ఎవరైనా అక్కడ ఉండే సిబ్బంది సహకరించారా అనే అంశంపై పోలీసులు సైతం దృష్టిసారించినట్లు సమాచారం.

విద్యార్థి సంఘాల ఆందోళన

బాత్‌రూంలో సెల్‌ఫోన్ కలకలం విషయం బయటికి రాగానే పలువురు విద్యార్థి సంఘాల నాయకులు పెద్దఎత్తున పాలిటెక్నిక్ కళాశాల వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, సెల్‌ఫోన్ కెమెరాలు పెడుతుంటే నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్, సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలని, ఈ ఘటనపై కలెక్టర్, ఎస్పీ వివరణ ఇవ్వాలని డిమాడ్ చేశారు. దీంతో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ అప్పయ్య, ఎస్ఐ శీనయ్య, సిబ్బంది అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పారు. కళాశాలలో సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతున్నాయని వారికి ఇబ్బంది కలిగించొద్దని కోరారు. విద్యార్థి సంఘాల నాయకులు ఎస్పీ కార్యాలయానికి వస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేసేందుకు హామీ ఇస్తామని చెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

పలు సెక్షన్ల కింద కేసులు నమోదు

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల బాలికల బాత్‌రూంలో మొబైల్‌తో వీడియో రికార్డు చేసిన సిద్ధార్థ్‌పై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ శీనయ్య తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి సదరు విద్యార్థిపై బీఎన్ఎస్ 77, 79 బీఎన్ఎస్, సెక్షన్ 66, సెక్షన్ 67, ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

⇨ సాయంత్రం ఎస్పీ జానకి, అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్‌తో కలిసి కలెక్టర్ విజయేందిర కళాశాలను సందర్శించారు. ప్రిన్సిపాల్‌తో పాటు విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థినుల భద్రతకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పోలీసులకు సమాచారం ఇచ్చాం..

సప్లిమెంటరీ పరీక్ష రాయడానికి వచ్చిన ఓ విద్యార్థి బాలికల బాత్‌రూంలో సెల్‌ఫోన్ పెట్టాడు. ఈ విషయం విద్యార్థుల ద్వారా తెలియడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాం. పోలీసులు వచ్చి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని సదరు విద్యార్థిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. సిబ్బంది, సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ సెల్‌ఫోన్ పెట్టిన విద్యార్థి వెనక వైపు నుంచి గోడ దూకి వెళ్లి ఫోన్ పెట్టాడు. ఈ విషయంలో పూర్తి పారదర్శకంగా వ్యవహరించాం.

– మోహన్‌బాబు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్

పునరావృతం కాకూడదు..



ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుంది. ఇలాంటి చర్యలను ఏమాత్రం సహించదు. వెంటనే ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించిన సిబ్బంది, ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠినంగా వ్యవహించాలి.

– రమేష్, రాష్ట్ర నాయకుడు, ఎన్ఎస్‌యూఐ

ఎవరెవరి ప్రమేయం ఉందో..



సీఎం సొంత జిల్లాలో ఇలాంటి ఘటనలు జరగడం విచారకరం. పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థి బాత్‌రూంలో సెల్‌ఫోన్ పెడితే అక్కడ ఉన్న సిబ్బంది, అధికారులు, సీసీ కెమెరాలు ఉన్నా ఎందుకు ముందే పట్టుకోలేదు. ఇందులో ఎవరెవరి ప్రమేయం ఉందో నిగ్గు తేల్చాలి. గంటన్నర వీడియో ఫోన్‌లో రికార్డు అయింది.

– సతీష్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్


పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్‌తో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయేందిర

క్యారెట్ సాగు.. లాభాలు బాగు


సాగులో ఉన్న క్యారెట్ పంట

సక్రియానాయక్, గద్వాల జిల్లా వ్యవసాయశాఖ అధికారి

అలంపూర్: జిల్లాలో ఎర్ర, మసక నేలలు విస్తారంగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ నేలల్లో బోర్లుబావుల కింద వరి సాగు చేస్తున్నారు. కానీ వరికి బదులుగా క్యారెట్ సాగు పండిస్తే లాభదాయకంగా ఉంటుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సక్రియానాయక్ రైతులకు సూచిస్తున్నారు. సాగు వివరాలను ఆయన వివరించారు.

పొలం తయారీ : పొలం దుక్కిదున్ని సిఫార్సు చేసిన ఎరువులను వేసి మెత్తగా ఉండేలా చూడాలి. చిన్న చిన్న మడులు చేసుకొని 25 సెంటీమీటర్ల దూరంలో బోదేలు తయారు చేయాలి.

రకాలు : కరోడ, పూసా కేసర్, పూసా యమదగ్ని, నాంటెస్ ఇండియా గోల్డ్. ఈ రకాల పంటలన్నీ 100 నుంచి 120 రోజుల్లోపు చేతికొస్తాయి.

విత్తన మోతాదు : ఎకరాకు 3 కిలోలు

ఎరువులు : ఎకరాకు 4 నుంచి 5 టన్నుల పశువుల ఎరువు, పొటాష్ 60 కిలోలు, యూరియా 20 కిలోలు ఆఖరి దుక్కిలో వేయాలి. మరో 20 కిలోల యూరియా పంట 40 నుంచి 45 రోజుల్లో పైపాటుగా వేయాలి. దుంప ఊరే సమయంలో 13:0:45ను 5 గ్రాములు లీటరు నీటిలో కలిపి ఎకరాకు రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి.

కలుపు యాజమాన్యం : విత్తనం వేసిన రెండ్రోజుల్లోపు పెండిమిథాలను లీటరు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. 25 రోజుల తర్వాత మెట్రిబుజిన్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.


కోత కోసిన క్యారెట్

నీటి యాజమాన్యం : 8 నుంచి 15 రోజుల వ్యవధిలో నీరందించాలి. డ్రిప్, ఎత్తైన మడుల ద్వారా నీరందిస్తే నాణ్యత గల దుంపలు అధిక దిగుబడి పొందవచ్చు.

సస్యరక్షణ : ఈ పంటలో సస్యరక్షణ చాలా తక్కువ. ఆకుమచ్చ తెగులు నివారణకు మాంకోజెబ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

పంట కోత : దుంపలు ముదిరిన తర్వాత నారింజ రంగకు మారుతాయి. అప్పుడు పొలానికి నీరు పెట్టి మరుసటి రోజు ఆకులతో సహా దుంపలను తీయాలి. కోత ఆలస్యమైతే దుంపల నాణ్యత తగ్గుతుంది. యాజమాన్య పద్ధతుల ఆధారంగా ఎకరాకు 10 నుంచి 15 టన్నుల దిగుబడి వస్తుంది.

సాగులో మెళకువలు

విత్తనాన్ని ఇసుకతో కలిపి నాటుకోవాలి. విత్తనం, ఇసుక 1:4 నిష్పత్తిలో కలిపి నాటాలి.

- నత్రజని అధిక మోతాదులో వాడొద్దు. అలా వాడితే కోత ఆలస్యమై పగుళ్లు ఏర్పడతాయి.
- కాల్షియం లోపిస్తే దుంపపై నొక్కులు ఏర్పడి నల్లటి మచ్చలు ఏర్పడతాయి. నివారణకు కాల్షియం నైట్రేట్ 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- పొలాన్ని సరిగా దుక్కి చేయకపోయినా, సేంద్రియ ఎరువులు వాడకయినా దుంప నేలలోకి వెళ్లకుండా చీలిపోతుంది. కాబట్టి దుక్కి జాగ్రత్తగా చేయాలి.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక


రాష్ట్రస్థాయికి ఎంపికైన స్టార్ లింక్ ప్రదర్శన, విపత్తు నిర్వహణ ప్రదర్శన


విపత్తు నిర్వహణ ప్రయోగం

నారాయణపేట ఎడ్యుకేషన్: జడ్చర్లలోని పోలేపల్లి సెజ్‌లో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా నుంచి మొత్తం ఏడు విభాగాల్లో 14 మంది విద్యార్థులు, సెమినార్ విభాగంలో మరో విద్యార్థి ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి భానుప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయి ఎంపికైన వాటిలో ట్రాన్స్‌పోర్ట్, కమ్యూనికేషన్ అంశంపై సీనియర్ విభాగంలో బొగారం ఉన్నత పాఠశాల విద్యార్థిని అనూష రూపొందించిన 'స్టార్ లింక్' ప్రదర్శనతో పాటు విపత్తు నిర్వహణ అంశంపై జూనియర్ విభాగంలో జిల్లా కేంద్రానికి చెందిన యూనివర్సల్ పాఠశాల విద్యార్థి అలియ ప్రదర్శనలు ఉన్నట్లు పేర్కొన్నారు.

భూ బదలాయింపులో ఇద్దరు తహసీల్దార్లపై కేసు నమోదు

అమ్రాబాద్: భూ బదలాయింపు విషయంలో గతంలో అమ్రాబాద్ తహసీల్దార్లుగా పనిచేసిన కృష్ణయ్య, పాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రజిత తెలిపారు. అమ్రాబాద్ గ్రామానికి చెందిన మాలె శంకరయ్యకు వారసత్వంగా సర్వే నం.900లో 1.10 ఎకరాల భూమిలో ఇది వరకే ఎకరా భూమిని బస్టాండ్ నిర్మాణం కోసం విరాళంగా ఇచ్చారు. మిగిలిన పది గుంటల భూమిలో 5 గుంటల భూమిని మాలె శంకరయ్యకు తెలియకుండా అమ్రాబాద్‌కు చెందిన పలకపల్లి అలీ పేరు మీద పట్టా చేశారని శంకరయ్య కోర్టులో ప్రైవేట్ కేసు వేశారు. దీంతో అప్పట్లో పనిచేసిన తహసీల్దార్లు కృష్ణయ్య, పాల్‌తోపాటు పలకపల్లి అలీ మీద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

సృజన వికసించే.. పరిశోధనలు మెరిసే


గద్వాలలో వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించడానికి వచ్చిన విద్యార్థులు

- ఉత్సాహంగా జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన
- నూతన ఆవిష్కరణలతో సత్తా చాటిన భావి శాస్త్రవేత్తలు

గద్వాలటౌన్: సమాజంలోని సమస్యలను పరిష్కరించాలనే ఆలోచనలతో సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతున్నారు విద్యార్థులు. విజ్ఞానం వికాసం కోసమే కాదు.. జనహితం కోసం అన్న మహనీయుల స్ఫూర్తి పథాన్ని అణువణువుగా నింపుకొని అద్భుతాలు సృష్టిస్తున్నారు. ఏదో సాధించాలనే పట్టుదల.. తపనతో విద్యార్థులు పరిశోధనలు రూపొందిస్తున్నారు. శనివారం జరిగిన జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని శ్రీనివాస రామానుజన్ ప్రాంగణంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ప్రతిభతో పోటీ పడ్డారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన వీక్షకులతో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది.



అంశం : టీఎల్ఎంతో సులభ పద్ధతిలో బోధన..
పాఠశాల : ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల, గద్వాల
ప్రదర్శన : ఉపాధ్యాయుడు నాగరాజు
ఉపయోగం : పాఠ్యాంశాలపై విద్యార్థులు పట్టు సాధించేలా సులభ పద్ధతుల్లో బోధించేందుకు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం)ను ఉపయోగపడుతుంది. వినూత్నమైన బోధన పద్ధతిలో విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దవచ్చు. భూ భ్రమణం, భూ పరిభ్రమణం, గ్రహణాలు, రుతువులు, చంద్ర కళలు తదితర వాటిని ప్రయోగాత్మకంగా తయారు చేయించి, విద్యార్థులకు సులువుగా బోధన అందించవచ్చు.



అంశం : ప్లాస్టిక్ వ్యర్థాలతో రోడ్లను నిర్మించడం..
పాఠశాల : జెడ్పీహెచ్ఎస్, మార్లబీడు, ధరూర్ మండలం
విద్యార్థి : సంతోష్, 8వ తరగతి
గైడ్ టీచర్ : ఎల్లస్వామి
ఉపయోగం : ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి రోడ్ల నిర్మాణంలో ఉపయోగించడం వల్ల పర్యావరణంలో కాలుష్యం తగ్గుతుంది. తక్కువ నిర్మాణ వ్యయంతో పాటు మన్నికైన రోడ్లుగా నిలుస్తాయి. సాధారణ రోడ్ల కంటే తక్కువ ఎనర్జీని వినియోగిస్తుంది. ఫలితంగా కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయి.

అంశం: కంప్యూటర్ గణనలో 3డీ ఉపయోగాలు..
పాఠశాల: జెడ్పీహెచ్ఎస్, అమరవాయి, మల్దకల్ మండలం
విద్యార్థిని : ఇందు, 8వ తరగతి
గైడ్ టీచర్ : అనిత
ఉపయోగం : గణితంలోని ద్విమితీయ, త్రిమితీయ ఆకారాలకు డిజిటల్ టెక్నాలజీని వినియోగిస్తే అనేక ఉపయోగాలు ఉంటాయి. నిజ జీవితంతో పాటు భవిష్యత్‌లో విద్యార్థులకు దోహదం చేస్తుంది. ఇంటి నిర్మాణ ప్లాన్ గీయవచ్చు. రాకెట్ తయారీలోని స్థూపం, శంఖువులను వాడవచ్చు. బుల్లెట్ తయారీ, ప్యాకేజింగ్‌లో ఈ విధానాన్ని వాడుతారు.



అంశం : ఏఐ టెక్నాలజీతో ఫ్లోర్ క్లీనర్..
పాఠశాల : జెడ్పీహెచ్ఎస్, లింగనవాయి, అలంపూర్ మండలం
విద్యార్థి : సందీప్ కుమార్, 8వ తరగతి
గైడ్ టీచర్ : మనోహర్‌రెడ్డి
ఉపయోగం : తక్కువ శ్రమతో ఇంటిలోని దుమ్మును తొలగించడం.. తర్వాత నీటితో ఫ్లోర్‌ను తుడవడం వంటి పనులకు దోహదపడుతుంది. ఫ్లోర్ క్లీనింగ్ సమయంలో అడ్డంకులు, దిశలను మార్చుకోవడానికి అందులోని అల్ట్రాసోనిక్ సెన్సార్‌ను ఉపయోగిస్తుంది.



ఈతకు వెళ్లి యువకుడి గల్లంతు

ధన్వాద: స్నేహితులతో కలిసి బావిలో ఈత కొట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతైన ఘటన ధన్వాడ మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ధన్వాడకు చెందిన బాలస్వామి, గద్దం రాజు, మరో యువకుడు గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయప్రాంగణంలో ఉన్న బావిలో ఈతకు వెళ్లారు. అందులో ఒకరికి ఈత కొట్టేందుకు రాకపోవడంతో ఒడ్డుపైనే ఉన్నాడు. బాలస్వామి, రాజు బావిలోకి దూకారు. రాజు ఒడ్డుపైకి చేరుకోగా.. బాలస్వామి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, పోలీసులు బావివద్దకు చేరుకొని గాలించినా ఫలితం లేకపోయింది. బావిలో నీటిని తోడేందుకు ప్రయత్నిస్తున్నారు. యువకుడి గల్లంతుతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

గద్వాలటౌన్: గురుకుల విద్యా సంస్థలలో విద్యార్థులకు భద్రత లేకుండా పోయిందని, ఫుడ్‌పాయిజన్, పాము కాటు వంటి సంఘటనలు నిత్యం చోటు చేసుకుంటున్నాయని, విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, విద్యార్థులకు భరోసా కల్పించాలని డిమాండ్ ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరేష్‌తేజ అన్నారు. గురుకులాల్లో విద్యార్థుల ఆత్మహత్యలు.. ప్రభుత్వ తీరును నిరసిస్తూ శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతులను బహిష్కరించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి, సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సుమారు గంట పాట ఆందోళన చేపట్టడంతో కలెక్టరేట్‌కు వెళ్లే ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. తరువాత పోలీసుల జోక్యంతో విద్యార్థులు ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా నరేష్‌తేజ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ పాలనలో గురుకుల విద్యా సంస్థలలో విద్యార్థుల చావుకేకలు వినిపిస్తున్నాయని ఆరోపించారు. ఏడాది కాలంలోనే 49 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు గణేష్, వెంకటేష్, అశోక్, లోకేష్, నరేష్‌పటేల్, మురళి, సురేష్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ వాలీబాల్ పోటీలకు హబీబుద్దీన్ ఎంపిక

అడ్డాకుల: నేషనల్ వాలీబాల్ పోటీలకు మూసాపేటకి చెందిన హబీబుద్దీన్ ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ఇటీవలే జరిగిన సెలక్షన్‌లో ప్రతిభ కనబర్చాడు. దీంతో తెలంగాణ సీనియర్ వాలీబాల్ జట్టుకు ఎంపిక చేశారు. ఈనెల 7నుంచి 13వ తేదీ వరకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగే వాలీబాల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరుపున బరిలో దిగనున్నాడు. అతడు ప్రస్తుతం తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఎన్‌జీపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ఆఫ్ భారతీయార్ యూనివర్సిటీలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. భారతీయార్ విశ్వవిద్యాలయం తరుపున అక్కడే వాలీబాల్ పోటీల్లో పాల్గొంటున్నాడు. హబీబుద్దీన్ తెలంగాణ జట్టుకు ఎంపిక కావడంతో అతడి తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాబే సుప్రీం.. రెడ్‌బుక్కే రాజ్యాంగం!

ఏపీలో బరితెగించి వ్యవహరిస్తున్న సీఐడీ

న్యాయస్థానమంటే ఖాతరు లేదు.. సీఆర్‌పీసీ 164 అంటే లెక్కే లేదు

సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా కుతంత్రం

ఐఏఎస్ అధికారులతో తప్పుడు వాంగ్మూలాల నమోదుకు పన్నాగం

సాక్షి, అమరావతి: భారత రాజ్యాంగమే ప్రామాణికం.. సుప్రీంకోర్టు తీర్పులే మార్గ నిర్దేశం.. అన్నది దేశంలో పరిపాలన వ్యవస్థకు దిక్సూచి. పాలకులు, అఖిల భారత సర్వీసు అధికారులతోపాటు అందరూ పాటించాల్సిన విధివిధానాలవి. కానీ రాష్ట్ర సీఐడీ విభాగం అందుకు పూర్తి విరుద్ధంగా బరితెగిస్తోంది. 'చంద్రబాబే మాకు సుప్రీం.. టీడీపీ రెడ్‌బుక్కే మాకు రాజ్యాంగం.. చంద్రబాబు అవినీతి కేసులు నీరుగార్చడమే ఏకైక లక్ష్యం' అని చెలరేగిపోతోంది. అందుకోసం ఏకంగా న్యాయస్థానాల్లో సీఆర్‌పీసీ 164 కింద నమోదు చేసిన వాంగ్మూలం పవిత్రత, ప్రమాణికతనే దెబ్బ తీసేలా కుట్రలకు పదును పెడుతోంది. ఓసారి సీఆర్‌పీసీ 164 కింద ఇచ్చిన వాంగ్మూలాన్ని మార్చేందుకు వీల్లేదన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను బరితెగించి మరీ ఉల్లంఘిస్తోంది. చంద్రబాబు సూత్రధారి, పాత్రధారిగా సాగిన కుంభకోణాల గురించి గతంలో పలువురు ఐఏఎస్ అధికారులు న్యాయస్థానంలో ఇచ్చిన వాంగ్మూలాలకు భిన్నంగా తప్పుడు వాంగ్మూలాలు నమోదు చేయించేందుకు సీఐడీ సన్నాహాలు వేగవంతం చేస్తోంది. డీజీపీ పోస్టు ఇస్తానని ముఖ్య నేత ఎర వేయగానే సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కూడా తోసిరాజంటూ సీఐడీ ఉన్నతాధికారి చెలరేగిపోతుండటం విస్మయ పరుస్తోంది. ఈ వ్యవహారం యావత్ దేశాన్ని విస్మయానికి గురి చేస్తోంది.

మొదటి వాంగ్మూలానికి విరుద్ధంగా ఉండకూడదు

సీఆర్‌పీసీ 164 కింద ఓసారి న్యాయస్థానంలో నమోదు చేసిన వాంగ్మూలం అత్యంత విశ్వసనీయమైనదిగా పరిగణిస్తాం. ఎందుకంటే న్యాయమూర్తి ఎదుట ప్రమాణ పూర్వకంగా నమోదు చేసిన వాంగ్మూలమది. ఆ వాంగ్మూలాన్ని మార్చేందుకు వీల్లేదు. గతంలో ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా వాంగ్మూలం ఇచ్చేందుకు సాక్షులు ప్రయత్నిస్తే వారిని సంబంధిత న్యాయస్థానం ప్రశ్నించాలి. మొదట ఇచ్చిన వాంగ్మూలాన్నే సాక్ష్యంగా పరిగణలోకి తీసుకోవాలి.

– 2024 నవంబరు 25న ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు. ఈ మేరకు ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన ఓ కేసులో జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీష్‌చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం విస్పష్టమైన తీర్పునిచ్చింది.

విరుద్ధంగా ఇస్తే కఠిన చర్యలు

ఓసారి సీఆర్‌పీసీ 164 కింద ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా మరోసారి వాంగ్మూలం ఇస్తే అది నేరంగా పరిగణిస్తాం. ఎందుకంటే ప్రమాణ పూర్వకంగా ఇచ్చిన వాంగ్మూలాన్ని న్యాయమూర్తి చదవి వినిపించిన తర్వాత సమ్మతించి, మరీ సంతకం చేసి ఇచ్చిన వాంగ్మూలమది. మొదటిసారి ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా మరో వాంగ్మూలం ఇవ్వడమంటే.. మొదట ఇచ్చింది తప్పుడు వాంగ్మూలమని అంగీకరించినట్టే. అత్యంత విశ్వసనీయమైన న్యాయస్థానంలో న్యాయమూర్తి ఎదుట ప్రమాణం చేసి మరీ తప్పుడు వాంగ్మూలం ఇచ్చినట్టు అవుతుంది. అంటే అబద్ధపు వాంగ్మూలం ఇచ్చినందుకు నేరంగా పరిగణిస్తాం. ఆ విధంగా అబద్ధపు వాంగ్మూలం ఇచ్చిన వారిపై ఐపీసీ 193, సీఆర్‌పీసీ 340 కింద కఠిన చర్యలు తీసుకుంటాం.

– వినోద కుమారి వర్సస్ మధ్యప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు

ఎదుర్కోవాల్సిన పరిణామాలను న్యాయమూర్తి వివరించాలి

సీఆర్‌పీసీ 164 కింద ఓసారి ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా మరో వాంగ్మూలం ఇచ్చేందుకు సాక్షి ప్రయత్నిస్తే.. దాని వల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితులు, ఎదుర్కోవాల్సి వచ్చే పరిణామాల గురించి న్యాయమూర్తి ఆ సాక్షికి వివరించాలి.

– అలహాబాద్ హైకోర్టు తీర్పు

కుంభకోణాల కుట్రదారు చంద్రబాబే

2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో యథేచ్ఛగా అవినీతికి పాల్పడ్డారు. రాజధాని అమరావతిలో అసైన్డ్ భూముల కుంభకోణం, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో అక్రమాల కుంభకోణం, ఫైబర్‌నెట్ కుంభకోణం, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కుంభకోణం, మద్యం కుంభకోణం, ఇసుక కుంభకోణం.. ఇలా వివిధ కుంభకోణాలతో వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. వాటిపై సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) కేసు నమోదు చేసి పూర్తి ఆధారాలతోసహా ఆ భారీ దోపిడీని బట్టబయలు చేసింది. ఆ వ్యవహారాల్లో కీలక పాత్రధారులుగా ఉన్న ఐఏఎస్ అధికారులను విచారించింది. నిబంధనలకు విరుద్ధమని తాము అభ్యంతరం



తెలిపినప్పటికీ అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఏమాత్రం పట్టించుకోలేదని వారు చెప్పారు. చంద్రబాబు ఒత్తిడితోనే నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూముల బదలాయింపు, ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు, కాంట్రాక్టుల కేటాయింపు, నిధుల విడుదల.. ఇలా అన్ని వ్యవహారాలు సాగాయని వెల్లడించారు. టీడీపీ ప్రభుత్వంలో సీఆర్‌డీఏ కమిషనర్‌గా వ్యవహరించిన చెరుకూరి శ్రీధర్, ఫైబర్‌నెట్ ఎండీగా వ్యవహరించిన అజయ్ జైన్, గుంటూరు కలెక్టర్‌గా చేసిన కాంతిలాల్ దండే తదితరులు ఆ వాస్తవాలను 'సిట్'కు తెలిపారు. అంతే కాకుండా ఆ విషయాలను న్యాయస్థానంలోనూ వెల్లడించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సీఆర్‌పీసీ 164 కింద వారు ఇచ్చిన వాంగ్మూలాలను న్యాయస్థానం నమోదు చేసింది. అందుకే ఆ కేసుల్లో చంద్రబాబును ప్రధాన నిందితుడు(ఏ1)గా పేర్కొంటూ సిట్ కేసులు నమోదు చేసింది. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్ట్ చేయగా, ఆయన రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో 52 రోజులు రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే.

తప్పుడు వాంగ్మూలాల నమోదుకు ప్రభుత్వ కుట్ర

గత ఏడాది రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం చంద్రబాబు అవినీతి కేసులను నీరుగార్చేందుకు కుట్రకు తెరతీసింది. అందుకోసం డీజీపీ, సీఐడీ అధికారులు ఆ కేసుల దర్యాప్తు వివరాలను చంద్రబాబుకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అంటే ప్రధాన నిందితుడే ఆ కేసులను సమీక్షించారు. ఆ కేసులను ఎలా నీరుగార్చాలనే కుట్రకు అప్పుడే బీజం పడింది. అనంతరం చంద్రబాబు తరపున గతంలో వాదించిన ఢిల్లీ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా రంగ ప్రవేశం చేశారు. డీజీపీ, సీఐడీ అధికారులతో సమావేశమై చంద్రబాబుపై కేసులను నీరుగార్చే కుట్రకు కార్యాచరణ రూపొందించారు. గతంలో చంద్రబాబే కుట్రదారు.. కుంభకోణాలకు ఆయనే సూత్రధారి.. అని న్యాయస్థానంలో వాంగ్మూలాలు ఇచ్చిన వారితో తాజాగా తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించాలని పన్నాగం పన్నారు. ఆ బాధ్యతను సీఐడీకి అప్పగించారు. గతంలో సిట్‌లో సభ్యులుగా ఉన్న కింది స్థాయి అధికారులను డీజీపీ, సీఐడీ చీఫ్ పిలిపించుకుని మరీ తప్పుడు వాంగ్మూలాలు నమోదు చేసే ప్రక్రియను వివరించారు. బాధిత రైతులు, సాధారణ సాక్షులను కింది స్థాయి అధికారులు బెదిరిస్తుండగా, ఐఏఎస్ అధికారులతో తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించే బాధ్యతను సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ భుజానికెత్తుకున్నారు.

బెదిరించి.. భయపెట్టి..

కుట్రలో భాగంగా ఐఏఎస్ అధికారులు చెరుకూరి శ్రీధర్, అజయ్ జైన్‌లతో తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించేందుకు సీఐడీ బరితెగించింది. గతంలో న్యాయస్థానంలో 164 సీఆర్‌పీసీ కింద తాము ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా వాంగ్మూలం ఇవ్వాలని వారిపై సీఐడి తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చింది. బెదిరింపులకు పాల్పడింది. తప్పుడు వాంగ్మూలం ఇవ్వకపోతే సంగతి తేలుస్తామని హెచ్చరించింది. గతంలో ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా తప్పుడు వాంగ్మూలం ఇవ్వడం సాధ్యం కాదని, అది నేరమని కూడా ఆ అధికారులు, న్యాయ నిపుణులు చెప్పినా సరే సీఐడీ చీఫ్ రవి శంకర్ అయ్యన్నార్ ఏమాత్రం వినిపించుకోలేదని సమాచారం. ఇలా సీఐడీ సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగించి చెరుకూరి శ్రీధర్, అజయ్ జైన్‌లను బెంబేలెత్తించారు. దాంతో వారు తప్పుడు వాంగ్మూలాలు ఇచ్చేందుకు సమ్మతించినట్టుగా సీఐడీ వర్గాలు చెబుతున్నాయి. వారిద్దరితో గుంటూరులోని న్యాయస్థానంలో శుక్రవారం తప్పుడు వాంగ్మూలం నమోదు చేయించేందుకు సీఐడీ అధికారులు తీసుకువచ్చేందుకు సిద్ధపడ్డారు. అయితే న్యాయాధికారి సెలవులో ఉండటంతో ఆ ప్రయత్నాన్ని శనివారానికి వాయిదా వేశారు. తీరా శనివారం చెరుకూరి శ్రీధర్ ఒక్కరినే తీసుకెళ్లారు. కోర్టు బయట కొద్ది సేపు హైడ్రామా నడిచింది. ఆ తర్వాత కోర్టు హాలు లోపలికి వెళ్లకుండానే శ్రీధర్ వెనుదిరిగారు. మళ్లీ ఈ నెల 8వ తేదీన ఆయన్ను న్యాయస్థానానికి తీసుకొచ్చి వాంగ్మూలం నమోదు చేయించాలని సీఐడీ నిర్ణయించినట్లు తెలిసింది.

ఏడేళ్ల వరకూ జైలు శిక్ష

న్యాయస్థానాల్లో కేసుల విచారణ ప్రక్రియలో ఏ సందర్భంలో అయినా అబద్ధపు వాంగ్మూలం ఇవ్వడం తీవ్రమైన నేరం అని సెక్షన్ 229 (1) స్పష్టం చేస్తోంది. అటువంటి అబద్ధపు వాంగ్మూలం ఇచ్చిన వ్యక్తికి ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధించేందుకు అవకాశం కల్పిస్తోంది. అంటే సీఆర్‌పీసీ 164 కింద న్యాయమూర్తి ఎదుట ప్రమాణ పూర్వకంగా రెండు విరుద్ధ వాంగ్మూలాలు ఇస్తే అందులో ఒకటి అబద్ధపు వాంగ్మూలమే అవుతుంది. మొదటి వాంగ్మూలం గానీ రెండో వాంగ్మూలం గానీ ఏది అబద్ధపు వాంగ్మూలం అయినా శిక్షార్హమే. దాన్ని నేరంగా పరిగణించి ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు.

మరీ ఇంత ద్రోహమా? ఇంత బరితెగింపా?

- కూటమి సర్కార్ తీరుపై వైఎస్ జగన్ మండిపాటు
- తల్లికి వందనం, రైతు భరోసా ఎక్కడ చంద్రబాబూ?
- ప్రజలను నమ్మించి.. అధికారంలోకి వచ్చాక వంచనా?
- పిల్లలు, తల్లులు, రైతులు, యువత, వలంటీర్లు.. అందరినీ మోసం చేశారు



సాక్షి, అమరావతి: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో అలసత్వం, నిర్లక్ష్యం, ఎగవేత ధోరణి ప్రదర్శిస్తున్న కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తాజాగా తల్లికి వందనం ఎగవేతపై కూటమి సర్కార్‌ను నిలదీశారు. లక్షలాది మంది తల్లులు, పిల్లలు.. అన్నదాతలంటే మీకు అలుసా.. అని ప్రశ్నించారు. మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేయడం, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కడం మీకు అలవాటుగా మారిపోయిందని నిప్పులు చెరిగారు. ఈ మేరకు శనివారం ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విటర్) ఖాతాలో పోస్ట్ చేశారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

- ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలపై ఇంతటి బరితెగింపా? మేనిఫెస్టోపై ఇంతటి తేలిక తనమా? ప్రజలకు ఇచ్చిన మాటను అమలు చేయకుండా టేక్ ఇట్ గ్రాంటెడ్‌గా తీసుకుంటారా? లక్షల మంది తల్లులకు, పిల్లలకు, రైతులకు ఇంతటి ద్రోహం తలపెడతారా?
- అధికారంలోకి వస్తే తల్లికి వందనం అని, ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. అధికారంలోకి రాగానే అంతకు ముందు మేం ఇస్తున్న అమ్మ ఒడి పథకాన్ని సైతం ఆపేశారు. వరుసగా కేబినెట్ సమావేశాలు జరుగుతున్నాయి కానీ, తల్లికి వందనం పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తారో నిర్దిష్టంగా చెప్పలేదు. తీరా ఈ ఏడాదికి ఇవ్వం అని కేబినెట్లో తేల్చి చెప్పేశారు. ఇంతకన్నా మోసం ఏమైనా ఉంటుందా? ఇంతకన్నా పచ్చి దగా ఏమైనా ఉంటుందా?
- ఇక రైతు భరోసా తీరు కూడా అలానే ఉంది. ఈ ఏడాది ఖరీఫ్, రబీ రెండు సీజన్లు అయిపోతున్నా ఇవ్వకుండా గడిపేశారు. మేము అధికారంలోకి వచ్చిన ఆ ఏడాదే.. అంటే 2019 అక్టోబర్‌లో ప్రారంభించి నప్పటి నుంచి క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం రూ.13,500 చొప్పున 53.58 లక్షల మంది రైతుల చేతిలో, రూ.34,378 కోట్లు పెట్టాం. కేంద్రం ఇచ్చేది కాకుండా మీరు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్నారు. ఇప్పుడు ఖరీఫ్ అయిపోయిందీ, రబీ కూడా అయిపోయింది. ఒక్క పైసా ఇవ్వలేదు. ఇది రైతులను నిలువెల్లా మోసం చేయడం కాదా? 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ రూ.18 వేలు ఇస్తామన్నదీ మోసమే. నిరుద్యోగ భృతి కింద యువతీ యువకులకు రూ.36 వేలు చొప్పున ఇస్తామన్నది కూడా మోసమే. 50 సంవత్సరాలు నిండిన ప్రతి అక్కకూ రూ.48 వేలు అయినా మోసమే. ఇంటింటికీ సేవలు అందిస్తూ మంచికి అర్థం చెప్పిన వలంటీర్లకూ మీరు చేసింది మోసమే. ఈ మోసాలు అన్నింటికీ తోడు, మీ పాలనలో ప్రజలపై ఛార్జీలతో బాదుడే బాదుడు కనిపిస్తోంది. ప్రతి అడుగులోనూ స్కామ్‌లే. ఇసుకను వదలడం లేదు, మద్యాన్నీ వదలడం లేదు.
- చంద్రబాబూ గారూ.. రోజులు గడుస్తున్న కొద్దీ, మీరు చేస్తున్న మోసాలు ఒక్కొక్కటీ బయటకు వస్తూనే ఉన్నాయి. ఇవి ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీస్తున్నాయి. ఒక బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి, వారి గొంతుకై నిలుస్తోంది. ప్రజలకు మీరు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం వారి తరఫున నిలబడుతుంది.

శ్రీవారి సేవలో జాన్వీ కపూర్

బాలీవుడ్ సినీ తార జాన్వీకపూర్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆమె శుక్రవారం రాత్రి కాలినడకన తిరుమల చేరుకుని శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. సినీ డైరెక్టర్ వీఎస్ ఆదిత్య కూడా తిరుమలేశుడిని దర్శించుకున్నారు.

– తిరుమల



జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు గద్వాల క్రీడాకారులు


గోవర్ధన్


లక్ష్మి

గద్వాలటౌన్: ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో ఈ నెల 8నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు గద్వాలకు చెందిన క్రీడాకారులు గోవర్ధన్, లక్ష్మి ఎంపికయ్యారు. డిసెంబర్ 27 నుంచి 30వ తేదీ వరకు జనగాం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు తరఫున గోవర్ధన్ పాల్గొని అత్యంత ప్రతిభ కనబర్చారు. డిసెంబర్ 22 నుంచి 25వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల కబడ్డీ పోటీల్లో లక్ష్మి సత్తా చాటారు. వీరి క్రీడా నైపుణ్యాన్ని గుర్తించి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కన్వీనర్ అబ్రహం తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపికపై కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ డీకే స్నిగ్ధారెడ్డి, సీనియర్ క్రీడాకారులు హర్షం తెలిపారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌లో సత్తాచాటిన క్రీడాకారులు


బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు

ధన్వాడ: సీఎం కప్ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ధన్వాడకు చెందిన నలుగురు విద్యార్థులు బంగారు పతకాలు, ఒక విద్యార్థి రజత పతకం సాధించారని నారాయణపేట రెజ్లింగ్ కార్యదర్శి రవికుమార్ తెలిపారు. హన్మకొండలో గత నెల 30 నుంచి ఈ నెల 2 వరకు పోటీలు జరగగా 40 కిలోల విభాగంలో రజిత, 29 కిలోల విభాగంలో బాలమణి, 53 కిలోల విభాగంలో గీత, 57 కిలోల విభాగంలో నాగలక్ష్మి బంగారు పతకాలు సాధించగా.. 65 కిలోల విభాగంలో సందీప్ రజత పతకం సాధించారని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అధికారి వెంకటేష్, ధన్వాడ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అబ్దుల్ ముజీబ్, కేజీబీవీ ప్రత్యేక అధికారి గంగమ్మ క్రీడాకారులను అభినందించారు.

శరవేగంగా వంతెన నిర్మాణం


కృష్ణానదిపై కొనసాగుతున్న వంతెన నిర్మాణం

- కృష్ణానదిపై అమెరికాలోని బోస్టన్ బ్రిడ్జి తరహాలో..
- రూ.140 కోట్ల అంచనా వ్యయం
- ఇప్పటికే 50 శాతం పనులు పూర్తి
- 2026, జూన్ నాటికి వన్‌వే పూర్తికి ప్రణాళిక
- 2027 నాటికి పూర్తిస్థాయిలో వినియోగంలోకి..

కృష్ణా: అమెరికాలోని బోస్టన్ బ్రిడ్జి తరహాలో మండల సరిహద్దులోని తెలంగాణా–కర్ణాటక అంతరాష్ట్ర రహదారి (ఎన్‌హెచ్ 167)పైనున్న కృష్ణానదిపై చేపడుతున్న వంతెన నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం నిజాం కాలం నాటి వంతెన ఉండగా.. దాని స్థానంలో కొత్త వంతెన నిర్మాణానికి కేంద్రం మూడేళ్ల కిందట రూ.140 కోట్లు మంజూరు చేసింది. కాగా టెండర్లు త్వరగా పూర్తికాకపోవడంతో పనుల ప్రారంభంలో జాప్యం జరిగినట్లు అధికారులు వివరిస్తున్నారు. ఇప్పటి వరకు 50 శాతం పనులు పూర్తికాగా.. మిగిలిన పనులు 2027 నాటికి పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. కర్ణాటక–తెలంగాణ రాష్ట్రాలను కలుపుతున్న ఎన్‌హెచ్ 167 రహదారిపై కొనసాగుతున్న వంతెన నిర్మాణం భారత్‌మాల పరిధిలో కొనసాగుతుందని ఇంజనీర్లు తెలియచేశారు.

2027 పూర్తి చేసేలా..

ఈ వంతెన నిర్మాణం 2027 నాటికి పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు తెలిపారు. మొదట 2026, జూన్ నాటికి ఒక వరుసలో వాహనాలు వెళ్లేవిధంగా పనులు పూర్తి చేస్తామని చెప్పారు.

నిధుల కొరతతోనే జాప్యం..

కేటాయించిన నిధులు ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవడంతోనే పనులు ఆలస్యం అవుతున్నాయని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. వర్షాకాలంలో నదిలో నీరు పారుతుండటంతో పనులు నిలిచిపోతాయని.. మిగిలిన 8 నెలల్లోనే పనులు చేపడుతున్నామని వివరించారు.

15 మంది ఇంజనీర్లు.. 200 మంది కార్మికులు

రోజు 15 మంది ఇంజనీర్లు, 200 మంది కార్మికులు పనుల్లో పాల్గొంటున్నారు. నదిలో పిల్లర్ల నిర్మాణం పూర్తిగావడంతో పైన ఆర్చీల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి. మేజర్ పనులు పూర్తయ్యాయని మిగిలిన పనులు త్వరగా పూర్తి చేస్తామని ఇంజనీర్లు వివరించారు. నదిలో నీరు లేని సమయంలోనే పనులు పూర్తి చేసుకోవాలనే ఉద్దేశంతో పనులు వేగంగా కొనసాగిస్తున్నామని చెప్పారు.

మెరుగైన గ్రేడింగ్ సాధిద్దాం


మాట్లాడుతున్న పీయూ వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీని త్వరలో న్యాక్ బృందం సందర్శించనున్న నేపథ్యంలో శనివారం తెలంగాణ ఉన్నత విద్యామండలి సహకారంతో అధ్యాపకుల ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీయూ వైస్ చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. న్యాక్ బృందం తనిఖీల నేపథ్యంలో అధ్యాపకులు, అన్ని డిపార్ట్‌మెంట్‌ల హెచ్‌ఓడీలు, డీన్‌లు పూర్తిస్థాయి సమాచారంతో ఉండాలన్నారు. ఆయా వివరాలతో పాటు యూనివర్సిటీలో ఉన్న అన్ని వసతులను న్యాక్ బృందం పరిశీలిస్తుందన్నారు. అందరూ సమష్టిగా కృషిచేసి యూనివర్సిటీకి మంచి గ్రేడింగ్ తీసుకువచ్చేందుకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ చెన్నప్ప, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, ఎన్వీ శాస్త్రి, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, కంట్రోలర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు

మహబూబ్‌నగర్ క్రైం: అమ్మాయిలను వేధించడం, ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. ఇటీవల అమ్మాయిలను వేధించిన నలుగురు యువకులతో పాటు వారి కుటుంబసభ్యులకు శనివారం పట్టణంలోని భరోసా సెంటర్‌లోని షీటీం కార్యాలయంలో డీఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించాడు. ఇంట్లో ప్రవర్తనపై తల్లిదండ్రులు నిత్యం గమనిస్తూ ఉండటంతో పాటు మంచి విషయాలపై తెలియచెప్పాలన్నారు. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ యువత సామాజిక బాధ్యతను కలిగి ఉండాలన్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృత్తం కాకుండా చూసుకోవాలన్నారు. అమ్మాయిలను ఇబ్బందులకు గురి చేస్తే చట్టపరంగా ఎలాంటి చర్యలు తీసుకుంటారు అనేది వారికి వివరించారు. దీని వల్ల భవిష్యత్‌లో జరిగే నష్టాలను తల్లిదండ్రులకు తెలియచెప్పారు. కార్యక్రమంలో ఉమెన్ పీఎస్ సీఐ శ్రీనివాసులు, ఎన్జీఓల నుంచి చంద్రశేఖర్, జగపతిరావు, రాజసింహుడు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ

అచ్చంపేట: ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులు కొన్ని రోజుల నుంచి సమ్మె చేస్తున్నారు. శనివారం పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కను హైదరాబాద్‌లో ఆయా జిల్లాల సంఘం నాయకులు కలిశారు. సమస్యలపై మంత్రితో ముఖాముఖి చర్చలు జరిపారు. సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ ఇవ్వడంతో సమ్మె విరమిస్తున్నట్లు నాయకులు ప్రకటించారు. కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులర్ చేసే అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థికమంత్రి భట్టి విక్రమార్కతో చర్చిస్తానని భరోసా ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1804 మంది సీఆర్‌టీలకు ప్రతి నెల 5వ తేదీన జీతాలు ఇచ్చే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. కాంట్రాక్టు ఉపాధ్యాయల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజ్‌గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ జవహర్‌లాల్‌లు తెలిపారు.


మంత్రి సీతక్కను కలిసిన కంట్రాక్టు ఉపాధ్యాయులు

24 నుంచి అచ్చంపేటలో ఆలిండియా క్రికెట్ టోర్నీ

అచ్చంపేట రూరల్: అచ్చంపేటలో ఈనెల 24 నుంచి ఆలిండియా స్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ చెప్పారు. శనివారం అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నల్లమలలో క్రీడాకారులకు కొదవ లేదన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. దేశం, రాష్ట్రంలోని క్రీడాకారులు క్రికెట్ టోర్నీలో పాల్గొనవచ్చని తెలిపారు. పట్టణంలోని రాజీవ్, ఎన్టీఆర్ మినీ స్టేడియాలను అన్నివిధాలా అభివృద్ధి చేస్తామన్నారు. సమావేశంలో సీవీకే ఆలిండియా లెవల్ టీ 20 క్రికెట్ అధ్యక్షుడు కపిలవాయి చంద్రమోహన్, కార్యదర్శి రఘురాం తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి హుండీ లెక్కింపు



జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి హుండీని శనివారం లెక్కించగా రూ.21,53,272 ఆదాయం లభించినట్లు ఈఓ దీప్తిరెడ్డి తెలిపారు. దేవాదాయ శాఖ పర్యవేక్షకులు శ్రీనివాసులు సమక్షంలో హుండీ లెక్కింపు చేపట్టినట్లు వివరించారు. అలాగే 4.79 గ్రాములు మిశ్రమ వెండి వస్తువులు వచ్చాయన్నారు. హుండీ లెక్కింపులో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, గరుడగమన సేవా సమితి సభ్యులు, గ్రామీణ వికాస్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

కందులు క్వింటాల్ రూ.7,801

జడ్చర్ల/ దేవరకద్ర: బాదేపల్లి మార్కెట్ యార్డులో శనివారం కందులకు క్వింటాలు గరిష్టంగా రూ.7,801, కనిష్టంగా రూ.5,311 ధరలు లభించాయి. అలాగే వేరుశనగ గరిష్టంగా రూ.6,795, కనిష్టంగా రూ.5,069, రాగులు రూ.2,433, మొక్కజొన్న గరిష్టంగా రూ.2,435, కనిష్టంగా రూ.2,418, ధాన్యం ఆర్ఎన్ఆర్ గరిష్టంగా రూ.2,769, కనిష్టంగా రూ.2,389, జొన్నలు రూ.3,009, చిట్టిముత్యాలు రూ.3,351, హంస గరిష్టంగా రూ.2,067, కనిష్టంగా రూ.1,756, పత్తి గరిష్టంగా రూ.6,799, కనిష్టంగా రూ.5,589 చొప్పున పలికాయి.

దేవరకద్ర మార్కెట్‌లో..

దేవరకద్ర మార్కెట్ యార్డులో శనివారం జరిగిన ఈ టెండర్లలో కందులు క్వింటాల్‌కు గరిష్టంగా రూ.7,556, కనిష్టంగా రూ.7,269 ధరలు లభించాయి. సీజన్ లేకపోవడంతో మార్కెట్‌కు కేవలం వంద బస్తాల కందులు అమ్మకానికి వచ్చాయి.

రామన్‌పాడులో 1,021 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడులో శనివారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ నుంచి 1,030 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఈ క్రమంలో రామన్‌పాడులోని ఎన్టీఆర్ కాల్వ ద్వారా 1,020 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 15 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వదిలామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.